క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: పట్టణంలో లో ఓల్టేజీ సమస్యను అధిగమించే క్రమంలో స్థానిక నీలమ్మకాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గురువారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌కే రాజపురం, సీఎల్ నాయుడు వీధి, సీతంపేట రోడ్డు, ఏరియా ఆస్పత్రి పరిసరాలు, ఎంఎం. నగర్, యాతవీధి, వేమకోటివారి వీధి, శ్రీరామా కళామందిర్ వీధుల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నీలకంఠాపురంలో ప్రజాదర్బార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని నీలకంఠాపురంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి వినతులు అందజేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, నాయకులు కోలా రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

సందర్శన



మాట్లాడుతున్న ఐటీడీఏ డిప్యూటీ ఈఈ నారాయుడు

సీతంపేట: ఐటీడీఏ డిప్యూటీ ఈఓ పి.నారాయుడు పలు ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్ పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పూతికవలస పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ -1 పరీక్ష తీరును పరిశీలించారు. అలాగే చిన్నబగ్గ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. వంద శాతం రిజల్ట్ రావడానికి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. గోరపాడు, గూడంగి కాలనీలను కూడా సందర్శించారు. కార్యక్రమంలో సీఎంఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సాలికిరిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: మండలంలోని సాలికిరికి చెందిన కిల్లారి మిన్నారావు (44) హైదరాబాద్‌లో ఇటీవల మృతి చెందారు. అలాగే తాలాడకు చెందిన వలరౌతు నిరంజన్ (49) వంశధార నదిలో మునిగి మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం ఆయా గ్రామాలను సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తకోట చంద్రశేఖర్, దామోదర కంఠయ్య, రొక్కం రామారావు, పగడాలమ్మ, వై.పాపినాయుడు, వలరౌతు రామకృష్ణ, భూపతి కిరణ్, కార్యకర్తలున్నారు.

ఊరటనిచ్చిన వర్షం..



పాలకొండ రూరల్: పట్టణంలో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: మండల వ్యాప్తంగా కురిసిన వర్షం వరి పంటకు ఊపిరి పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా తోటపల్లి కాలువల ద్వారా సాగునీటికి ఎదురుచూస్తున్న రైతన్నల ఆశలు అడియాసలు కావడంతో వరుణుడిపైనే భారం వేశారు. ఈ సమయంలో బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కొనసాగడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి పంట ప్రస్తుతం దుబ్బు చేసే స్థితికి చేరింది. ఇప్పటికే ఎరువులు వేసిన రైతులు నీటి తడులకు ప్రత్యామ్నాయ పద్ధతులకు ఉపక్రమిస్తున్న తరుణంలో వరుణుడి కరుణతో దాదాపు 8 వేల ఎకరాలకు మేలు చేకూరిందంటున్నారు. ఇదిలా ఉంటే తాజా వర్షంతో పట్టణంలో వాతావరణం చల్లబడింది. మరోవైపు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జన జీవనం, పలు వ్యాపారాలు స్తంభించాయి.

గోతుల్లో నీరు..

భామిని: మండలంలో కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. గోతుల్లో నీరు చేరడంతో వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ వర్షం వరి పంటకు మేలు చేస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రక్షణ కల్పించాలి

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన బాధాకరం. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలి. హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి. వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. ప్రతీ ఆస్పత్రిలో మహిళలకు ప్రత్యేకంగా సౌకర్యాలు కల్పించాలి. రాత్రి వేళలో సిబ్బందికి రక్షణ కల్పించేలా పోలీసులను నియమించాలి.

– పి.కావేరి, ఏఎస్ఎం, జర్న సచివాలయం, దుద్దుఖల్లు పీహెచ్‌సీ





కఠినంగా శిక్షించాలి

మహిళా వైద్య ఉద్యోగులపై ప్రభుత్వాలకు ఏ మాత్రం గౌరవం ఉన్నా.. హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, ఇతర సిబ్బంది కోసం ప్రత్యేక వాష్ రూంలు ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలి.

– ఎం.శాంతి, ఎంఎల్‌హెచ్‌పీ, మండ, తాడికొండ పీహెచ్‌సీ

మహిళా మార్ట్ వ్యాపారం డీలా..

- డ్వాక్రా మహిళలు తప్ప... ఇతరులెవరూ కొనుగోలు చేయని వైనం
- మహిళల ఆర్థిక బలోపేతానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్టులు
- కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైఎస్సార్ పేరును తొలగించిన నిర్వాహకులు
- గతంలో రోజుకు రూ.80 వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిగిన వ్యాపారం
- నేడు రూ. 15 వేల నుంచి 20 వేల రూపాయల మధ్య వ్యాపారం



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న మహిళామార్ట్

వీరఘట్టం:

మహిళల ఆర్థిక స్వావలంబనకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీరిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు మార్ట్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టంలో ఈ ఏడాది జనవరి 12న వైఎస్సార్ మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మార్ట్ ఏర్పాటుకు మండలంలోని 15 వేల మంది డ్వాక్రా సంఘాల మహిళలు ఒక్కొక్కరూ రూ.200 పెట్టుబడితో రూ.30 లక్షలు పోగుచేసి వ్యాపారం ప్రారంభించారు. దీనికి ప్రభుత్వం కూడా చొరవ తీసుకుని కార్పొరేట్ కంపెనీలతో అనుసంధానం చేసింది. వీరికి మార్ట్ నిర్వాహకులు నిత్యావసర సరుకులు, కాస్మొటిక్స్, వంటనూనెలు ఇలా అనేక వస్తువులను హోల్‌సేల్ మార్కెట్‌లో కొనుగోలు చేసి ఈ మార్ట్ ద్వారా విక్రయించడం ప్రారంభించారు. ప్రారంభించిన నాటి నుంచి మే నెల వరకు ఈ ఐదు నెలల్లో సుమారు రూ.1.50 కోట్లు వ్యాపారం చేపట్టారు. జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత నేటి వరకు వ్యాపారాలు డీలా పడడంతో బేరాలు సన్నగిల్లి మార్ట్ నిర్వహణ భారంగా మారింది.

వెలవెలబోతున్న మహిళా మార్ట్....

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీరఘట్టం మహిళా మార్ట్ కొనుగోలుదారులతో కళకళలాడేది. నేడు కొనుగోలుదారులు లేక మార్ట్ వెలవెలబోతోంది. సుమారు రూ.13 లక్షల వ్యయంతో మార్ట్ నిర్మాణం చేపట్టారు. ఇందులో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.6 వేల జీతం, ఇద్దరు సేల్స్‌మెన్, ఉమెన్‌లకు రూ.12 వేలు.. స్వీపర్‌కు రూ.3 వేలు.. ఇంటి అద్దె రూ.25 వేలు.. ప్రతి నెలా కరెంట్ బిల్లు సరాసరిన రూ.6 వేలతో కలిపి ప్రతినెలా నిర్వహణ ఖర్చు రూ.52 వేలు అవుతోంది. లాభం మాత్రం అంతంత మాత్రమే ఉండడంతో మార్ట్‌లో వ్యాపారం డీలా పడింది.

కొరవడిన పర్యవేక్షణ..

వీరఘట్టం మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ మార్ట్‌కు విశాలమైన స్థలం ఉంది. ఈ స్థలంలో సరుకులను కొనుగోలుదారులకు కనిపించేటట్లు ఏర్పాట్లు చేయాలి. అయితే ఇక్కడ మాత్రం ఆ పరిస్థితి లేకపోవడంతో కొనుగోలుదారులు ఇటువైపు రావడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు కూడా వ్యాపారాభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడంతో మహిళా మార్ట్‌లో వ్యాపారం డీలా పడింది. మరికొద్ది రోజులు ఇలానే వదిలేస్తే చివరకు నష్టాలు వచ్చే పరిస్థితి ఉంది.

తగ్గిన కొనుగోళ్లు..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్సార్ మహిళా మార్ట్ బోర్డులో వైఎస్సార్ పేరును తొలగించారు. అంతేకాకుండా బ్యాంక్ ఉగ్యోగుల మాదిరి ఏసీ రూంలో వీరు ఉండడంతో మార్ట్ వైపు సామాన్యులు కూడా చూడడం లేదు. డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలు తప్ప ఇతరులెవ్వరూ ఇక్కడ సరుకులు కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారం పూర్తిగా పడిపోయింది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో మార్కెట్‌లో ఒక్కో కిరాణాషాపు రోజుకు రూ.1 లక్ష నుంచి లక్షన్నర వరకు అమ్మకాలు చేస్తున్నారు. అయితే మహిళా మార్ట్‌లో మాత్రం రెండు నెలలుగా రోజుకు రూ.15 వేల నుంచి 20 వేల రూపాయల మాత్రమే వ్యాపారం జరుగుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.



బోర్డులో తొలిగించిన వైఎస్సార్ పేరు

జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మహిళా మార్ట్ వ్యాపారాభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలువురు మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

వ్యాపారాభివృద్ధికి చర్యలు చేపడతాం..

మహిళా మార్ట్ అభివృద్ధికి చర్యలు చేపడతాం. మహిళా సంఘాలతో పాటు స్థానికులు కూడా ఇక్కడ సరుకులు కొనుగోలు చేసేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించి మార్ట్‌లో వ్యాపారాభివృద్ధికి చర్యలు చేపడతాం. పబ్లిసిటీ పెంచి ప్రజలకు మార్కెట్ కంటే తక్కువ ధరకే నిత్యావసర సరుకులను అందజేసి మార్ట్‌కు పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతాం.

– జి.శివున్నాయుడు, ఏపీఎం, వీరఘట్టం

నేడు ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో ప్రవేశాలకు గురువారం మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఆయా ట్రేడులు పూర్తిచేసిన విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించి ఉద్యోగాలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.

పరిశీలన



ఇసుక మేటలను పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, తదితరులు

భామిని: మండలంలోని కాట్రగడ – బి వద్ద వంశధార నదిపై నిర్మించిన ఓపెన్ హెడ్ చానల్‌లో పేరుకుపోయిన ఇసుక మేటలను పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, స్థానిక తహసీల్దార్ ఆర్.ఉమామహేశ్వరరావు బుధవారం పరిశీలించారు. వియ్యర్‌లో పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగించేందుకు అనువైన మార్గాన్ని చూశారు. ఇసుక లారీల రవాణాకు అడ్డంకుల్లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎస్సై డి. అనిల్‌కుమార్, ఆర్ఐ ఎస్. రాంబాబు వీఆర్‌ఓలు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

పార్వతీపురంటౌన్: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలని ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని పెద బొండపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రసాయనాలు లేకుండా సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పొందవచ్చని, వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. అలాగే పొలం గట్లపై కంది, మునగ, బంతి, అరటి, కూరగాయ పంటలు వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ శారద, కేవీకె శాస్త్రవేత్త అమృతవీణ, ఎన్ఎఫ్ఏ వై.తిరుపతి, ఎంటీ శ్రీరాములు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ కార్యాలయాన్ని తరలించవద్దు



ఇన్‌చార్జ్ పీఓకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

- ఇన్‌చార్జ్ పీఓకు మాజీ ఎమ్మెల్యే కళావతి వినతి

సీతంపేట: ఐటీడీఏకు అనుబంధంగా నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ డీడీ కార్యాలయాన్ని శ్రీకాకుళానికి తరలించవద్దని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. ఈ మేరకు ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ వీవీ రమణను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన విద్యాసంస్థల పరిపాలన అంతా ఇక్కడి నుంచే కొనసాగించాలన్నారు. స్థానిక గిరిజనులు తమ పనుల నిమిత్తం శ్రీకాకుళం వెళ్లాలంటే చాలా ఇబ్బందని తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తరలింపు ఆపాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్.మోహన్‌రావు, ఎస్.కృష్ణ, అబ్బాస్, ఎస్.కాంతారావు, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పీఎం జన్‌మన్



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ గోపాలకృష్ణ

సీతంపేట: పీఎం జన్‌మన్ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని డీఎల్‌పీఓ గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీవీటీజీ ప్రజలకు ఉపయోగపడే 11 కీలకమైన మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. అలాగే ఎప్పటికప్పుడు గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్, మొబైల్ నెట్‌వర్క్ కవరేజీ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఉచిత రేషన్ కార్డులు, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన ద్వారా గర్భిణులకు ఆర్థిక సాయం, పోషకాహారం వంటివి అందజేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వన్‌ధన్ వికాస్ కేంద్రాల ద్వారా ప్రజల జీవనోపాధులు మెరుగుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఈఓపీఆర్‌డీ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు కోలక అవినాష్

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు(గ్రీన్ అంబాసిడర్లు)కు బకాయి వేతనాలు చెల్లించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోలక అవినాష్ డిమాండ్ చేశారు. ఈమేరకు గుమ్మలక్ష్మీపురంలోని గిరిజన సంఘం కార్యాలయంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. బకాయి వేతనాల సాధనకు చేపట్టాల్సిన కార్యచరణపై చర్చించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. వారికి ఉపాధిహామీ పనులను కూడా నిరాకరిస్తుండడం శోచనీయమన్నారు. బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, ఇకపై ఏ నెల వేతనం ఆ నెలే చెల్లించాలని, చెత్త రిక్షాలు పూర్తిగా పాడైనందున కొత్తవి మంజూరు చేయాలని, హ్యాండ్ గ్లౌజులు, షూష్ అందజేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించని పక్షంలో కార్మికుల తరఫున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మండంగి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు



ఆన్‌లైన్ శిక్షణ తరగతులలో పాల్గొన్న అధ్యాపకులు

గరుగుబిల్లి: ఉద్యాన పంటలలో ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు పొందేందుకు భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్), జాతీయ వ్యవసాయ ఉన్నత విద్యా పథకం(ఎన్ఏఆర్‌ఈఎస్)ల ద్వారా ఆన్‌లైన్ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు అసోసియేట్ డీన్ డా. బి.ప్రసన్నకుమార్ తెలిపారు. మండలంలో ఉల్లిభద్ర పరిధిలోని డా. వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో బుధవారం నుంచి ఈ నెల 30వరకు ఆన్‌లైన్ శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. ఈ శిక్షణా తరగతులలో డా. బీవీజీ ప్రసాద్ వంగ, టమోటా పంటలలో సంకర విత్తనోత్పత్తిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా. పి.ప్రదీప్‌కుమార్, డా. ఎం.అనిత. డా. హెచ్.అరుణకుమారి పలు అంశాలపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమంలో మెనూను సక్రమంగా అమలు చేయాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. పథకం నిర్వాహణలో లోపాలుంటే నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్మోహనరావు



బాగువలస పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్మోహనరావు

సాలూరు రూరల్: పీహెచ్‌సీల్లో పనిచేసే సిబ్బంది అన్ని వేళల్లో రోగులకు వైద్య సేవలందించేందుకు అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. టి.జగన్మోహనరావు అన్నారు. బాగువలస పీహెచ్‌సీ, గర్భిణుల వసతిగృహం, సాలూరులో బాలుర వసతి గృహాన్ని మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఓపీ రికార్డులను తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో ఎంతమంది వస్తున్నారు, రాత్రి వేళల్లో ఎలాంటి సమస్యలతో రోగులు వస్తున్నారు, వారికి అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఆర్‌బీఎస్ అధికారి డా. రఘుకుమార్, డా.రవికరణ్ ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



కలుపు తీయడంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

వీరఘట్టం: పంట పొలాల్లో కలుపు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ శాఖాధికారి జె.సౌజన్య అన్నారు. మండలంలోని చలివేంద్రి గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించి, కలుపు నివారణపై అవగాహన కల్పించారు. కలుపు నివారిస్తే పంట ఏపుగా పెరిగి దిగుబడి బాగుంటుందన్నారు. అలాగే రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ విధానంలో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆమెతో పాటు అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాడీవేడిగా ప్రజావేదిక

- చిన మంగళాపురం ఫీల్డ్ సహాయకురాలిపై సస్పెన్షన్ వేటు



ప్రజావేదికలో ఫిర్యాదులు వింటున్న ఉపాధి పీడీ రామచంద్రరావు, తదితరులు

పాలకొండ రూరల్: జాతీయ ఉపాధిహామీ పనులకు సంబంధించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో గురువారం చేపట్టిన ప్రజావేదిక కార్యక్రమం వాడీవేడిగా సాగింది. ఈ కార్యక్రమానికి ఉపాధి పీడీ కె.రామచంద్రరావు హాజరై ఆడిట్ పర్యవేక్షించారు. మండల పరిధిలో 2023 – 24 ఏడాది సంబంధించి 32 పంచాయతీల పరిధిలో 693 పనులు చేపట్టినట్లు ఏపీఓ ఈశ్వరమ్మ అధికారులకు వివరించారు. ఇందుకుగాను రూ.18 కోట్ల పైచిలుకు నిధులు ఖర్చు చేసినట్లు సభ దృష్టికి తీసుకువచ్చింది. ఈ మేరకు ఆరుగురు డీఆర్‌పీలు, మరో 6 మంది వీఎస్ఏలతో పాటు ఎస్ఆర్‌పీ ఎస్.మన్మథరావు నేతృత్వంలో సోషల్ ఆడిట్ బృందాలు క్షేత్ర స్థాయిలో గుర్తించిన సమస్యలను సభలో చదివి వినిపించారు. చిన్న మంగళాపురం, ఎం.సింగుపురం క్షేత్ర సహాయకులపై అందిన ఫిర్యాదుల మేరకు చిన్న మంగళాపురం ఫీల్డ్ సహాయకురాలిపై పీడీ సస్పెన్షన్ వేటు వేశారు. ఎం.సింగుపురంలో రూ.లక్షల్లో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై క్షేత్ర పరిశీలన చేపట్టాలని ఏపీడీ శ్రీహరి, స్థానిక ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరిలను ఆదేశించారు. బెజ్జిలో వేతనదారుల సంతకాల ఫోర్జరీపై కంప్యూటర్ ఆపరేటర్, ఫీల్డ్ సహాయకులపై.. ఓనిలో చోటుచేసుకున్న నిధుల దుర్వినియోగంపై రికవరీకి.. అట్టలి, ఇతర గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదులపై తదుపరి చర్యలకు ఆదేశాలిచ్చారు. గ్రామాల్లో బోర్డుల ఏర్పాటు చేయకుండా నిధులు జమచేయడంపై మండల స్థాయి అధికారులను పీడీ మందలించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన కార్యక్రమం రాత్రి 7 గంటల వరకు కొనసాగింది.

తగాదా కేసులో వ్యక్తి అరెస్ట్

పాచిపెంట: పొలంలో పశువులు కట్టే క్రమంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే తగాదాలో, ఓ వ్యక్తిపై కేసునమోదు చేసి అరెస్టు చేసినట్లు హెచ్‌సీ కృపారావు బుధవారం తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెదతాడురు గ్రామానికి చెందిన యాసర్ల హరీష్, ఈశ్వరరావు గ్రామ సమీపంలో ఉన్న పొలంలో ఈ నెల 17న రాత్రి సమయంలో పశువులు కట్టే క్రమంలో గొడవ పడ్డారు. ఈ గొడవలో ఈశ్వరరావుపై హరీష్ గడ్డపారతో దాడిచేశాడు. ఈ దాడిలో గాయపడి ఈశ్వరరావు పాచిపెంట పోలీస్ స్టేషన్‌లో హరీష్‌పై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేసి బుధవారం నిందితుడిని అరెస్టు చేశారు.

మనల్ని ఎవడ్రా ఆపేది..



మనల్ని ఎవడ్రా ఆపేది... అన్నట్టుంది శునకాల జోరు. పాలకొండ నగర పంచాయతీలో శునకాల బెడద ఎక్కువగా ఉంది. విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తూ ప్రజలను గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా ఆర్టీసీకాంప్లెక్స్, ఏరియా ఆస్పత్రి చుట్టుపక్కల, కోమటిపేట, కొత్తవీధి, వీవర్స్ కాలనీ, కోటదుర్గమ్మ దేవస్థానం, ప్రధాన మార్కెట్ పరిసరాల్లో.. ఇలా చెప్పుకుంటూ పోతే, ఇక్కడా అక్కడా అంటూ తేడా ఏమీ లేదు. ఎక్కడ చూసినా వీటి సంచారం అధికమైంది. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే పిల్లలతో పాటు వివిధ పనులపై బయటకు వచ్చే ప్రజలకు రక్షణ కొరవడింది. నగరపంచాయతీ యంత్రాంగం, పాలకవర్గం స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

– పాలకొండ రూరల్